



చిత్తూరు పీవీకేఎన్ కళాశాలలో ఎన్నికల సామగ్రిని సిద్ధం చేసుకుంటున్న అధికారులు, సిబ్బంది - ఎన్నికల సామగ్రితో కేంద్రాలకు వెళుతున్న సిబ్బంది - పోలింగ్ సెంటర్లకు వెళుతున్న కేంద్ర బలగాలు

తీర్పు నేడే


5.30 గంటలకు మాక్ పోలింగ్.. 7 గంటలకు పోలింగ్ ప్రారంభం	అభ్యర్థులు 97 మంది, ఓటర్లు 15,63,911 మంది	1,771 కేంద్రాలు 208 సెక్టార్లు	కేంద్రంలోకి సెల్‌ఫోన్ల నిషేధం

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం

స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి కేంద్రాలకు సామగ్రి

జిల్లా అంతటా 144 సెక్షన్ అమలు

ఐదేళ్ల తర్వాత మళ్లీ ఓట్ల పండగ రానేవచ్చింది. ఈ ఐదేళ్లలో పాలకులు తమను చూసిన తీరు, ప్రతిపక్షం తమ సమస్యలపై చేసిన పోరును బేరీజు వేసుకుని ఓటు వేసేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. ఏసీ గదుల్లో గడిపే నాయకులు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు కొన్ని నెలలుగా చెమటోడ్చారు. ఓటర్ల తీర్పు కోసం ఎదురుచూస్తున్నారు. మరి ఓటర్లు ఎవరికి జైకొడతారో.. చూడాల్సి ఉంది.



చిత్తూరు కలెక్టరేట్, మే 12: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం ఓటర్లు తీర్పు ఇవ్వబోతున్నారు. దీనికి సంబంధించి శనివారానికే జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. స్ట్రాంగ్ రూముల్లో భద్రపరచిన సామగ్రిని ఆదివారం పోలింగ్ కేంద్రాలకు తరలించారు. ఎన్నికల సిబ్బంది వారికి కేటాయించిన కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లాలో 15,63,911 మంది ఓటర్లు ఉన్నారు. వారు ఓటు వేసేందుకు వీలుగా 1,771 పోలింగ్ కేంద్రాలను 208 సెక్టార్లుగా విభజించారు. 425 కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించి వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశారు. సమస్యాత్మక కేంద్రాల్లో అత్యధికంగా పుంగనూరులో 100, పలమనేరు 88, కుప్పం 58, అత్యల్పంగా గంగాధరనెల్లూరులో 34 గుర్తించారు. 1,267 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ తీరును వీడియోగ్రఫీ చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. పూతలపట్టులో 209, కుప్పం 187, పలమనేరు 178, పుంగనూరు 172, నగరి 185, గంగాధరనెల్లూరు 201, చిత్తూరులో 135 కేంద్రాల్లో వీడియోగ్రఫీ చేస్తున్నారు. పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ కోసం 569 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. పార్లమెంటు స్థానానికి 19 మంది, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల స్థానాలకు 78 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు. అత్యధికంగా పలమనేరులో 14 మంది, అత్యల్పంగా నగరిలో ఏడుగురు బరిలో ఉన్నారు. 16కు మించి అభ్యర్థులు పోటీలో ఉండటంతో చిత్తూరు పార్లమెంటు స్థానానికి రెండు ఈవీఎంలను ప్రతి పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేశారు. చిత్తూరు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాలను నియమించారు. జిల్లా అంతటా శనివారం నుంచే 144 సెక్షన్, 30 పోలీసు యాక్టు అమలు చేస్తున్నారు. సోమవారం ఉదయం 5.30 గంటలకు సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో 50 ఓట్లు మాక్‌పోలింగ్ చేయాలి. వాటిని సీల్డ్ కవర్‌లో భద్రపరచాలి. సరిగ్గా 7 గంటలకు పోలింగ్ ప్రక్రియను ప్రారంభిస్తారు. పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్ల అనుమతిని నిషేధించారు. కలెక్టరేట్, ఆర్వో కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌ను జిల్లా ఎన్నికల విభాగం ఏర్పాటు చేసింది. అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. విభిన్న ప్రతిభావంతులు వందశాతం ఓటుహక్కును వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపు, వీల్‌చైర్లతోపాటు బీఎల్వో, వీఆర్‌ఏలను వారి సహాయకులుగా అందుబాటులో ఉంచనున్నారు.



మంగసముద్రం హౌసింగ్ కాలనీ వద్ద మోడల్ పోలింగ్ స్టేషన్

14 మోడల్ పోలింగ్ స్టేషన్లు

చిత్తూరు, మే 12: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఓటర్లను చైతన్యపరిచి ఓటింగ్ శాతాన్ని పెంచే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లావ్యాప్తంగా 14మోడల్ పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా ఓటర్లకు అవగాహన కల్పించి, ఓటు వేసే దిశగా చైతన్యపరచనున్నారు.

జిల్లాలో ఓటర్లు	15,63,911
పురుషులు	7,70,154
మహిళలు	7,93,682
థర్డ్ జెండర్	75
ఎన్ఆర్ఐ ఓటర్లు	167
సర్వీసు ఓటర్లు	3,380
యువ ఓటర్లు	40,450
85 ఏళ్లకు మించిన	6,485
పీడబ్ల్యూడీ ఓటర్లు	23,526
పోలింగ్ కేంద్రాలు	1,771
వెబ్ కాస్టింగ్ కేంద్రాలు	1,309
పోలింగ్ ప్రాంతాలు	1,267



మూడువేల మంది పోలీసులతో బందోబస్తు

- 236 రూట్ మొబైల్ పార్టీలతో గస్తీ
- క్రిటికల్ బూత్‌ల వద్ద అదనపు సిబ్బంది
- చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు

చిత్తూరు, మే 12: జిల్లాలో సోమవారం జరగనున్న అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల పోలింగ్‌కు మూడువేల మందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ఆదివారం ఆయన తన ఛాంబర్‌లో మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. భద్రత కోసం కేంద్ర బలగాలు, ఇతర రాష్ట్రాల నుంచి పోలీసు సిబ్బంది జిల్లాకు వచ్చినట్లు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందన్నారు. చెక్‌పోస్టుల వద్ద అదనపు భద్రతా ఏర్పాట్లు చేశామని చెప్పారు. పోలింగ్ ముందు రోజు నుంచి ముగిసే వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. 236 రూట్ మొబైల్ పార్టీలతో నిరంతరం గస్తీ నిర్వహిస్తామన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. జిల్లాలో ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే 100 లేదా జిల్లా వాట్సాప్ నెంబరు 9440900005కు సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం ఆయన పీవీకేఎన్ డిగ్రీ కళాశాల వద్ద స్ట్రాంగ్ రూమ్, ఇతర ఏర్పాట్లను తనిఖీ చేశారు.



పీవీకేఎన్ కళాశాల వద్ద ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

పోలింగ్ కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ క్యాంపులు

చిత్తూరు రూరల్, మే 12: జిల్లాలో ఎన్నికలు జరిగే 1,771 పోలింగ్ కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి తెలిపారు. ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ లేదా ఆశా కార్యకర్తలు క్యాంపులో అందుబాటులో ఉంటారన్నారు. మందులతోపాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

ఎన్నికల బరిలో 97 మంది అభ్యర్థులు

జిల్లాలో 97 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. ఇందులో చిత్తూరు పార్లమెంటు స్థానానికి 19 మంది, పుంగనూరులో 8, నగరి 7, గంగాధరనెల్లూరు 11. చిత్తూరు13, పూతలపట్టు 12, పలమనేరు 14, కుప్పంలో 13 మంది పోటీ చేస్తున్నారు. స్వతంత్ర, ఇతర చిన్నచితకా పార్టీలు పోటీ చేస్తున్నప్పటికీ టీడీపీ, వైసీపీల మధ్యే పోటీ ఉంది.



ఒకే ఈతలో ఐదు మేక పిల్లలు

రొంపిచెర్ల, ఏప్రిల్ 12: మండలంలోని మోటుమల్లెల పంచాయతీ నగిరిహరిజనవాడలో ఆదివారం రాత్రి ఒక మేక ఆదివారం ఐదు పిల్లలకు జన్మనిచ్చింది. రైతు గాలి శ్రీనివాసులుకు చెందిన మేక మొదటి కాన్పులో ఒకటి, రెండో కాన్పులో మూడు, మూడో కాన్పులో ఐదు పిల్లలకు జన్మనిచ్చింది. ఇందులో నాలుగు పోతు పిల్లలు కాగా, ఒకటి కొదమ ఉన్నట్లు రైతు తెలిపారు. ఈ విషయం తెలిసి గ్రామస్థులు ఆ పిల్లలను చూసేందుకు ఆసక్తి కనబరిచారు.

అభ్యర్థులే.. కానీ వాళ్లకు ఓటేసుకోలేరు

తమ గెలుపుకోసం అందరినీ ఓటడిగే ఆయా పార్టీల అభ్యర్థులు వాళ్లు. కానీ, వీళ్ల ఓటును వీళ్ల కోసం వేసుకోలేరు. ఎందుకంటే.. వీరికి ఇతర ప్రాంతాల్లో ఓటు హక్కు ఉంది. కుప్పంలో పోటీ చేస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబుకు మంగళగిరి నియోజకవర్గంలో ఓటుంది. ఆయన తన కుమారుడి కోసం ఓటు వేయనున్నారు. తంబళ్లపల్లె వైసీపీ అభ్యర్థి అయిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డికి పుంగనూరు నియోజకవర్గంలోని సదుం మండలంలో ఓటుంది. నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్‌కు చంద్రగిరి నియోజకవర్గమైన రామచంద్రాపురం మండలం వెంకటాపురంలోను.. పూతలపట్టు కాంగ్రెస్ అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు చిత్తూరు నియోజకవర్గంలోని చిత్తూరు రూరల్ మండలం వెంకటాపురం హరిజనవాడలో ఓటు హక్కు ఉంది. ఇక, చిత్తూరు పార్లమెంటుకు పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులదీ అదే పరిస్థితి. టీడీపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావుకు పర్చూరు నియోజకవర్గం.. వైసీపీ అభ్యర్థి, సిటింగ్‌ఎంపీ అయిన రెడ్డెప్పకు రాజంపేట పార్లమెంటు పరిధిలోని పుంగనూరు నియోజకవర్గంలో ఓటుంది. వీరంతా ఇతర అభ్యర్థులకు ఓటు వేయాల్సి ఉంటుంది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

ఏనుగు దాడిలో ఒకరి దుర్మరణం




మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు, మృతుడు చిన్నయ్య

తవణంపల్లె, మే 12: ఒంటరి ఏనుగు దాడిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని వెంగంపల్లె ఎస్టీ కాలనీలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. ఎఫ్ఎస్‌వో జయశేఖర్ కథనం మేరకు.. మండలంలోని వెంగంపల్లె ఎస్టీ కాలనీకి చెందిన చిన్నయ్య(50) ఉదయం బహిర్భూమి నిమిత్తం గ్రామ సమీపంలోని మామిడి తోపులోకి వెళ్లాడు. అప్పటికే అక్కడున్న ఒంటరి ఏనుగు ఆయనపై దాడి చేసింది. చెట్టుకేసి కొట్టి, కాలితో తొక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి చేరుకునే లోపు ఏనుగు వెళ్లిపోయింది. గ్రామస్తుల సమాచారం మేరకు ఎఫ్‌ఆర్వో బాలకృష్ణారెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ఆస్పత్రికి తరలించారు.

కుప్పంలో ఓటు రేటు రూ.4 వేలు

అంతా గ్రానైట్ డబ్బు

కుప్పం, మే 12: ఒకటీ రెండూ కాదు.. ఏకంగా నాలుగు వేలు ధర పలికింది కుప్పంలో ఓటు. అధికార పార్టీ రేటు ఇది. ప్రతిపక్ష పార్టీ రూ.2 వేలతో సరిపెట్టింది. పుంగనూరులోనూ రూ.3వేలు దాటని ఓటు రేటు కుప్పంలో మాత్రం ఎందుకింత పెరిగిందనే చర్చ జరుగుతోంది. మూడేళ్ల కిందట జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఓటుకు రూ.5 వేలు చొప్పున పంపకాలు జరిగాయి. దీంతో జనం అసెంబ్లీకి ఇంతకన్నా ఎక్కువే ఇస్తారని ఆశించారు. జిల్లా అంతా ఇస్తున్నట్లు రూ.2వేలు ఇస్తే జనం అసంతృప్తితో రగిలిపోతారని వైసీపీ రూ.4వేలు పంచిందని చెబుతున్నారు. కాకపోతే మున్సిపల్ ఎన్నికల్లోలా కాకుండా కేవలం 60 శాతమందికి లోపే పంపిణీలు జరిగాయి. అయినా సరే ఇంత పెద్ద మొత్తంలో నిధులు ఎక్కడి నుంచి వచ్చాయన్న ప్రశ్న విని పిస్తోంది. కుప్పం నియోజకవర్గంలో అధికారికంగా కంటే అనధికారికంగా గ్రానైట్ వనరులు అధిక సంఖ్యలో ఉన్నాయి. జిల్లా 'పెద్ద' కనుసన్నల్లో గ్రానైట్ వనరులను గుప్పిట్లో ఉంచుకుని, అక్రమంగా పిండిన కాసులను ఓట్ల కొనుగోలుకు వినియోగించారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. కొసమెరుపేమిటంటే రూ.4వేలు తీసుకుంటున్న జనం మాత్రం జై చంద్రబాబు అనడం. అదేంటి అంత డబ్బు తీసుకుని అనడిగితే..' మా డబ్బేగదా మాకు ఇచ్చిందేది' అని దబాయించి చెబుతున్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

నేడే ఓట్ల పండుగ

ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ● సాయంత్రం 6 వరకు అవకాశం

సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల భవితవ్యం తేల్చేందుకు ఓటర్లు సిద్ధం అయ్యారు. అదేసమయంలో పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ క్రమంలో ఎన్నికల సామగ్రిని ఆయా పోలింగ్ కేంద్రాల సిబ్బం దికి ఆదివారం ఉదయం అప్పగించారు. సిబ్బంది సాయంత్రమే వారికి కేటాయిం చిన పోలింగ్ కేంద్రాలకు చేరిపోయారు. పోలింగ్ కోసం తమ సరంజామాను సిద్ధం చేసే పనిలో తలమున కలయ్యారు. ఇక ఓటరు తమ భవిష్యత్తును నిర్ణయించుకునేందుకు కొద్ది గంటలే సమయం ఉంది. అందుకే సుదూరాల్లో ఉంటున్న వారు సైతం ఓట్ల పండుగకు సొంతూళ్లకు తరలి వచ్చారు. ఓటేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. కాగా కుప్పం, పుంగనూరు, పలమనేరు నియోజకవర్గాల్లో పోటీచేస్తున్న అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి.

- కుప్పం, పలమనేరు, పుంగనూరు

పుంగనూరు (అసెంబ్లీ)



టీడీపీ	వైసీపీ	బీసీవై	కాంగ్రెస్
చల్లా రామచంద్రారెడ్డి	పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి	బి.రామచంద్రయాదవ్	మురళీమోహన్‌యాదవ్

స్వతంత్రులు: 2 మొత్తం: 8

కుప్పం (అసెంబ్లీ)



టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్
నారా చంద్రబాబునాయుడు	కేఆర్‌జే.భరత్	ఆవుల గోవిందరాజులు

స్వతంత్రులు: 4 మొత్తం: 13

పలమనేరు (అసెంబ్లీ)



టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్
ఎన్.అమరనాథరెడ్డి	ఎన్.వెంకటేగౌడ	బి.శివశంకర్

స్వతంత్రులు: 9, మొత్తం: 14

చిత్తూరు (ఎంపీ)



టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్
దగ్గుమళ్ల ప్రసాదరావు	ఎన్. రెడ్డెప్ప	ఎం. జగపతి

స్వతంత్రులు: 13 మొత్తం: 19

రాజంపేట (ఎంపీ)



బీజేపీ	వైసీపీ
నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి	పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

మొత్తం: 18 మంది బరిలో ఎన్నికల నిలిచారు

పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది

కుప్పం, మే 12: పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది ఆదివారం తరలిపోయారు. కుప్పం నియోజకవర్గానికి సంబంధించి కుప్పంలోని ఎంఎఫ్‌సీ ప్రభుత్వ జూనియర్ కళాశాలను అధికారులు డిస్ట్రిబ్యూషన్ కేంద్రంగా ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో మొత్తం 243 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాలకు అవసరమైన మేర సిబ్బందిని నియమించారు. నియోజకవర్గ ఎన్నికల అధికారి జి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పోలింగ్ సిబ్బందికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఉదయం 7 గంటలకే పోలింగ్ సబ్బంది కేంద్రానికి చేరుకున్నారు. తమకు అప్పగించిన పోలింగ్ సామగ్రిని సరిచూసుకున్నారు. ఇదంతా ముగిసేసరికి మధ్యాహ్నమైంది. మధ్యాహ్న బోజనం డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్దే అధికారులు ఏర్పాటు చేశారు. భోజనం చేసిన తర్వాత తమకు కేటాయించిన పోలింగ్ బూత్‌లకు సిబ్బంది తరలివెళ్లారు. నియోజకవర్గంలో మొత్తం 2,25,755 మంది ఓటర్లున్నారు. వీరిలో పురుషులు 1,12,519 మంది కాగా మహిళా ఓటర్లు 1,13,247 మంది ఉన్నారు. వీరంతా సోమవారం తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.





కుప్పం డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఎన్నికల సిబ్బంది, డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న స్టేట్ అబ్జర్వర్ సాదిక్ అలీ

ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే ఓటింగ్ సాయంత్రం 6 గంటలకు ముగియనుంది. డీఎస్పీ శ్రీనాథ్ ఆధ్వర్యంలో శాంతిభద్రతల పరిరక్షణకోసం సిబ్బంది నియమితులయ్యారు. వారు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలలో ఈ సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు నియోజకవర్గం కావడంతో ఎన్నికల కమిషన్ ప్రత్యేక దృష్టి సారించింది. పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసింది. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా రాష్ట్ర, కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి వెళుతుంది. వెంటనే చర్యలు తీసుకుంటారు. కాగా కుప్పం ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఆదివానం రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు సాదిక్ అలీ తనిఖీ చేశారు. ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేశారు.

● విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేయండి:

కుప్పం నియోజకవర్గ వ్యాప్తంగా పోలింగ్‌కు తగా విద్యుత్తు సరఫరా ఏర్పాట్లు చేసినట్లు కుప్పం రెస్కో మేనేజింగ్ డైరెక్టర్ సీఎం.ప్రభాకర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో ఎక్కడ ఎటువంటి విద్యుత్తు సమస్యలు తలెత్తినా టోల్ ఫ్రీ నెంబర్ 1800425505505కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలియజేశారు. వెంటనే ఆయా సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు.

జోరుగా వైసీపీ ప్రలోభాల పర్వం

● ఓటుకు రూ.2 వేలు వంతున పంపకం
● మూడు రోజుల్లో బహుమతులంటూ కార్డులు

వి.కోట, మే 12: వి.కోట మండల పరిధిలో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అధికార పక్షం ప్రలోభాలకు దిగింది. ఓటుకు రూ.2 వేలు వంతున వలంటీర్ల ద్వారా జోరుగా పంప కాలు చేపట్టింది. నగదుతో పాటు మరో మూడు రోజుల్లో ఆకర్షణీయ బహుమతి ఉందంటూ పలమనేరు ఎమ్మెల్యే అభ్యర్థి ఫొటోతో కూడిన కార్డును ఓటర్లుకు అందించారు. కొన్నిచోట్ల పంపకాలు తమకు చేరలేదంటూ పెద్దఎత్తున స్థానికులు అధికార నేతల ఇళ్ల వద్దకు ఓటరు స్లిప్పులతో క్యూ కట్టారు. ఓటర్లకు నగదు పంపినా ఎందుకు సక్రమంగా చేరలేదోనని నేతలు తలలు పట్టుకుంటున్నారు. మరికొందరు ఓటర్లకు కనబడకుండా తప్పించుకు తిరుగు తున్నారు. ఓటర్లు మాత్రం తమ కోసం నగదు పంపితే మధ్యవర్తులు కాజేశారని చర్చించు కుంటున్నారు. ప్రధాన ప్రతి పక్షం సైతం ఓటర్లకు నగదు పంచిపెట్టింది.

పలమనేరు ఎన్నికల విధులకు 2090 మంది సిబ్బంది

పలమనేరు, మే12 : పలమనేరు నియోజకవర్గంలో ఎన్ని కల విధుల కోసం 2090 మంది సిబ్బందిని నియమిం చినట్టు ఎన్నికల అధికారి మనోజ్‌రెడ్డి తెలిపారు. నియోజక వర్గంలో మొత్తం 2,67,896 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. వీరి కోసం నియోజకవర్గంలో 288 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. నియోజ కవర్గంలో ఎన్నికల నిర్వహణ కోసం 306 మంది పీఓలు, 334 మంది ఏపీఓలు, 1,347 మంది ఓపీఓలు, 103 మంది మైక్రో అబ్జర్వర్లు, 35 మంది సెక్టోరల్ అధికారులను నియ మించా మన్నారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియో గించుకోవాలని కోరారు. అన్నిపోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.





ఎన్నికల విధులకోసం వచ్చిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న ఆర్‌వో మనోజ్‌రెడ్డి

పోలింగ్‌కు సర్వం సిద్ధం

వి.కోట, మే 12: వి.కోట మండల పరిధిలో 70 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్‌కు వెయ్యి మంది సిబ్బంది చేరుకున్నారు. మండల పరిధిలో 70,330 మంది వారి ఓటు హక్కును వినియోగిం చుకోనున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అన్ని పోలింగ్ కేంద్రాలో వెబ్‌కాస్టింగ్ ద్వారా ఎన్నికల సరళిని పర్యవేక్షించనున్నారు. బీఎస్‌ఎఫ్ 38 మంది, సీఐఎస్‌ఎఫ్ 8 మంది, ఎస్టీఎఫ్ 38 మంది, ఏఆర్‌తో పాటు మరో వంద మంది సాయుధ పోలీసు బలగాలు ఈ ఎన్నికల బందోబస్తు విధుల్లో ఉన్నారని సీఐ లింగప్ప తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అములులో ఉందని పేర్కొన్నారు. ప్రజలు సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించు కోవాలని తహసీల్దార్ కోరారు.



వి.కోటలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సదుం పోలింగ్ పైనే అందరి దృష్టి

పుంగనూరు, మే12: రాష్ట్రంలోనే అత్యంత సమస్యాత్మక నియోజకవర్గం పుంగనూరులోని మంత్రి పెద్దిరెడ్డి సొంత మండలం సదుంలో సోమవారం జరిగే ఎన్నికల పోలింగ్‌పైనే అందరూ దృష్టి సారించారు. సార్వత్రిక ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా జరగాలని, ప్రజలు ధైర్యంగా ఓటు హక్కు వినియో గించుకోవాలని మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, బీసీవై పార్టీ అభ్యర్థి రామచంద్రయాదవ్‌ల ఫిర్యాదు మేరకు కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా స్పందించి కేంద్ర బలగాలతోబాటు తమిళనాడు పోలీసులను పంపింది. పుంగనూరులోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ కెమెరాలతో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది.



సదుంలో కవాతు చేస్తున్న కేంద్ర బలగాలు (ఫైల్‌ఫోటో)

మామిడి బోర్డు ఏర్పాటు చేయండి

పలమనేరు, మే12 : ప్రతి ఏటా మామిడి రైతులు ప్రకృతి ప్రకోపంతో నష్టపోతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడికి దేశంలో ప్రసిద్ధిగాంచింది. ఇక్కడి మామిడికి దేశ వ్యాప్తంగా మంచిపేరుంది. ఎక్కువ మెట్టభూములు ఉండ డంతో పాటు నీటి సమస్య ఎక్కువగా ఉన్న ప్రాంతాలు ఉండడంతో రైతులు మామిడి సాగును విస్తృతంగా చేపట్టారు. తక్కువ నీటి వనరులతో పాటు నిర్వ హణ భారం పెద్దగా ఉండకపోవడంతో రైతులు మామిడి సాగుపై మొగ్గు చూప డానికి ప్రధాన కారణం. అయితే ప్రతి ఏడాదీ మామిడి దిగుబడి సమ యంలో వచ్చే తొలకరి వర్షాల సమయంలో వీచే గాలులకు చాలా తోటల్లో కాయలు నేలరాలిపోతున్నాయి. ఈ కాయలను మార్కె ట్లో కొనడం లేదు. కొను గోలు చేసినా చాలా తక్కువకు ఇస్తు న్నారు. పల్ప్ పరి శ్రమలు ఉన్నా సరైన ధర ఇవ్వక పోవడంతో మామిడి రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధర కల్పించేందుకు మామిడి బోర్డు ఏర్పాటు చేసి తమను ఆదు కోవాలని పలువురు మామిడి రైతులు కోరుతున్నారు.



పలమనేరులో గాలివానకు రాలిన మామిడి తోటలో రైతు మురగేష్

గడ్డివామికి నిప్పు

రామకుప్పం, మే 12: రామకుప్పం మండలం సింగసముద్రం గ్రామానికి చెందిన దేవరాజ్ గడ్డివామికి శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దేవరాజు కుటుంబ సభ్యులు ఇటీవల వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. గడ్డివామిలో టీడీపీ వారు మద్యం నిల్వ ఉంచారన్న అనుమానంతో వైసీపీ వారే గడ్డివామికి నిప్పు పెట్టి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బాధితుడికి రూ.20 వేలు ఆస్తినష్టం సంభవించిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ముగ్గురు అభ్యర్థులకు షాడో పార్టీల ఏర్పాటు

పుంగనూరు, మే 12: రాష్ట్రంలోనే అత్యంత సమస్యాత్మక నియోజకవర్గమైన పుంగనూరులో పోటీ చేస్తున్న ముగ్గురు ప్రధాన అభ్యర్థులకు పోలీసులు సోమవారం పోలింగ్ సందర్భంగా షాడోపార్టీ ఏర్పాటు చేశారు. వైసీపీ అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి, బీసీవై పార్టీ అభ్యర్థి బోడే రామచంద్రయాదవ్‌లకు పోలీసు షాడోపార్టీ ఏర్పాటు చేశారు. పోలింగ్ ముగిసేవరకు పోలీసులు వారి వెంటే తిరుగుతారు.

మాకు ఓటు ఉందిగదా.... డబ్బు ఇవ్వరా..!?

సోమల, మే 12: సోమవారం జరిగే ఎన్నిల్లో ఓటు వేసేందుకు ఇరు పార్టీల వారు నగదు పంపిణీ చేశారు. కొందరు ఓటర్లు తమకు నగదు అందలేదని ఆపార్టీల నాయకుల వెంట పడుతున్నారు. స్థానికంగా లేని వారు ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారు ఆదివారం స్వగ్రామాలకు చేరుకున్నారు. నగదు పంపిణీ గురించి తెలుసుకున్న వారు నాయకులు, మాజీ వలంటీర్లు వెంట పడుతున్నారు. డబ్బు ఇచ్చిన వారికే ఓటు వేస్తామని నాయకులను నిలదీస్తున్నారు.

నేటి నుంచి అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

చౌడేపల్లె, మే12: స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 13 నుంచి 25 వరకు జరుగుతాయని ఆలయ అర్చకులు రాజశేఖర్ దీక్షితులు పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 13న గణపతి ప్రార్థన, అంకురార్పణ, 14న ధ్వజారోహణం, సింహవాహనం, 15న యాళి వాహనం, 16న శేషవాహనం, 17న రావణవాహనం, 18న నంది వాహనం, 19న గజవాహనం, కల్యాణోత్సవం, 20న రథోత్సవం, 21న అశ్వవాహనం, 22న హంస వాహనం, ధ్వజావరోహణం, 23న ప్రథమ శయనోత్సవం, 24న ద్వితీయ శయనోత్సవం, 25 ఊంజల సేవ ఉంటుందని వివరించారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి

చౌడేపల్లె, మే12: ప్రశాంత వాతావరణంలో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో 144 సెక్షన్ అమలులో ఉందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని కోరారు. అన్ని పోలింగ్ బూత్‌లకు ఎన్నికల సామగ్రి చేరినట్లు తహసీల్దార్ శివరాముడు పేర్కొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

రొంపిచెర్ల,ఏప్రిల్12: రొంపిచెర్లలో ప్రశాంతంగా సార్వత్రిక ఎన్నికలు జరగడానికి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తహసీల్దార్ షేక్ మొహిద్దీన్ అన్నారు. ఆయన ఆదివారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా మండలంలోని 27 బూత్‌ల వద్ద వెబ్ కెమెరాలు ఏర్పాటు చేశారన్నారు. అవకతవకలకు అవకాశం లేదన్నారు. సాయుధ పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నారు.

ఓటు వేసేందుకు గుర్తింపు కార్డు తప్పనిసరి

కల్లూరు, మే 12: పులిచెర్ల మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రా లలో సోమవారం జరగ నున్న పోలింగ్‌కు ఎన్ని కల అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నిర్దిష్ట సమయానికి పోలింగ్ ప్రారంభమ వుతుందని ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సంబంధిత అధికారులు తెలిపారు. ఓటు హక్కు వినియోగించుకునే ప్రతి ఒక్కరూ తమ వెంట గుర్తింపు కార్డు తీసుకురావాలని తెలిపారు.



కల్లూరులో పోలింగ్ ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

గంగమ్మ నామస్మరణతో మార్మోగిన బోయకొండ

చౌడేపల్లె, మే12: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం గంగమ్మ నామస్మరణతో మార్మోగింది. ఉదయం ఆలయంలో అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి, అమ్మవారికి ప్రీతికరమైన వేపాకు తోరణాలతో ఆలయాన్ని అలంకరించారు. అమ్మవారికి అభిషేకాలు అర్చనలు చేసి స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే గాక తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. భక్తుల ఏర్పాట్లును ఆలయ ఈవో చంద్రమౌళిలు పర్యవేక్షించారు.



ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ

ప్రశాంత పోలింగ్‌కు సహకరించాలి

● 1962 మందితో పుంగనూరు ఎన్నికల విధులు
● కేంద్రబలగాలు, వెబ్‌కాస్టింగ్‌తో పోలింగ్
● పుంగనూరు ఈఆర్వో మధుసూదన్‌రెడ్డి

పుంగనూరు, మే 12: పుంగనూరు నియోజకవర్గంలో సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించడానికి పోలింగ్ అధికారులు, సిబ్బంది అప్రమత్తతతో వ్యవహరించాలని ఈఆర్వో వై.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పుంగనూరు అసెంబ్లీ, రాజంపేట పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలను పీవోలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పుంగనూరు, రూరల్, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల్లో 262 పోలింగ్ కేంద్రాల్లో 265 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ అధికారి, సహాయకులుగా ఎన్నికల విధులకు 1962 మందిని నియమించామని పేర్కొన్నారు. ఈవీఎంల సమస్య, తదితర ఇబ్బందులు ఎదురైతే వెంటనే సమాచారం ఇవ్వాలని, రిజర్వులో ఉన్న ఈవీఎంలు వినియోగించాలన్నారు. పోలింగ్ ముగియగానే పోలింగ్ సిబ్బంది, పోలీసులు ఎన్నికల సామగ్రితో తిరిగి కౌంటింగ్ కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. 100 పోలింగ్ కేంద్రాలను అత్యంత సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి కేంద్రబలగాలు, పోలీస్ బందోబస్తు చేపట్టడంతో బాటు పోలింగ్‌ను వెబ్‌కాస్టింగ్, వీడియో రికార్డింగ్‌తో నమోదు చేస్తున్నట్లు వివరించారు. పీవోలు 289మంది, ఏపీవోలు 312మంది, ఓపీవోలు 1245మంది, సెక్టోరియల్ ఆఫీసర్లు 31మంది, మైక్రో అబ్జర్వర్లు 116మంది ఉంటారని, 28 రూట్లు, 8 సెక్టార్ రూట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



పుంగనూరులో భారీ పోలీస్ బందోబస్తు


పుంగనూరులో ట్రైనీ ఎస్పీ, ఏఎస్పీ సుబ్బరాజు పర్య వేక్షణలో డీఎస్పీ మహబూబ్ బాషా, ఆరుగురు సీఐలు, ఏడుగురు ఎస్‌ఐలు, 45మంది ఏఎస్‌ఐలు, సీఆర్పీఎఫ్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, తమిళనాడు పోలీసులతో బాటు నియోజకవర్గం, జిల్లాలో పనిచేసే పోలీసులు 638 మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.







ఈవీఎంలు పరిశీలిస్తున్న పోలింగ్ అధికారులు ● ఈవీఎంలతో వెళుతున్న పోలింగ్ అధికారులు ● ఎన్నికల విధుల కోసం బస్సులు ఎక్కుతున్న పోలింగ్ సిబ్బంది


చెరకు రైతు గుర్తుకే మన ఓటు
రైతుకి ఓటేద్దాం...భవితకు బాటేద్దాం
భారత చైతన్య యువజన పార్టీ
BHARATHA CHAITANYA YUVAJANA PARTY
భారత చైతన్య యువజన పార్టీ
BCY PARTY
వరుస నెం.
అభ్యర్థి పేరు
గుర్తు
బ్యాలెట్ యూనిట్
6
బోడే రామచంద్ర యాదవ్
చెరకు రైతు గుర్తుకే మీ అమూల్యమైన ఓటు వేసి
B.C.Y పార్టీని అత్యధిక మెజారిటీ తో గెలిపించ ప్రార్థన
బోడే రామచంద్ర యాదవ్
పుంగనూరు శాసనసభ నియోజకవర్గం అభ్యర్థి




ఓటు వేయండిలా...

బీప్ శబ్దం వస్తేనే ఓటేసినట్టు సుమా..

గతంలో ఓటేసినా చాలామందికి ఈవీఎం అనగానే సందేహాలే. కొత్తవారికి మరీనూ. అందుకే ఓటు వేయకమునుపే వాటి గురించి ఒకసారి తెలుసుకుంటే మంచిది. సాధారణంగా పోలింగ్ బూత్‌లో ముగ్గురు అధికారులు వుంటారు.

1 బూత్‌లోకి ప్రవేశించాక ఓటరు తీసుకు వెళ్లే స్లిప్‌ను మొదటి అధికారి పరిశీలిస్తారు. ఏదో ఒక ఐడీ చూపించాక ఓటరు వివరాలను తన దగ్గర ఉన్న జాబితాతో సరిపోల్చుకుంటారు. ఆ కేంద్రంలో అక్కడే ఉన్న వివిధ పార్టీల ఏజెంట్లు కూడా ఆ ఓటరు పేరు, వరుస క్రమం చెక్ చేసుకుంటారు.



2 అప్పుడు ఓటరు పక్కనే ఉన్న రెండవ అధికారి వద్దకు వెళ్లాలి. సదరు అధికారి కూడా ఓటరు వివరాలను మరోసారి పరిశీలిస్తారు. ఓకే అని భావించాక ఆ ఓటరు నుంచి సంతకం తీసుకుంటారు. నిరక్షరాశ్య ఓటరైతే వేలిముద్ర తీసుకుంటారు. తర్వాత ఓటరు ఎడమచేతి చూపుడు వేలి చివరిన సిరా గుర్తు పెడతారు.




3 సిరా ముద్ర వేశాక మూడో అధకారి వద్దకు వెళ్లాలి. ఆ అధికారి కూడా స్లిప్ వివరాలను చెక్ చేస్తారు. కంట్రోల్ యూనిట్ మీట నొక్కి ఓటు రిలీజ్ చేస్తారు. ఓటు రిలీజ్ చేయకముందు కంట్రోల్ యూనిట్‌పై ఎడమ వైపు ఆకుపచ్చ రంగు ఎల్‌ఈడీ లైట్ వెలుగుతూ ఉంటుంది. ఓటు రిలీజ్ చేశాక కుడివైపు ఎరుపు రంగు లైట్ వెలుగుతుంది. దీనిని ఓటరు పరిశీలిస్తే మంచింది.



4 నాలుగోదశలో ఓటరు బ్యాలట్ యూనిట్ ఉన్నచోటకు వెళ్లాలి. ఆ యూనిట్‌పై అతికించిన బ్యాలట్ పేపరుపై అభ్యర్థుల పేర్లు, గుర్తులు ఉంటాయి. తనకు నచ్చిన అభ్యర్థి పేరు, గుర్తు ఉన్న మీట నొక్కాలి. వెంటనే దాని పక్కన బాణం గుర్తులో ఎర్రని లైట్ వెలుగుతుంది. వెంటనే బీప్ అనే శబ్దం వస్తుంది. తర్వాత బ్యాలట్ యూనిట్‌పై ఆకుపచ్చ రంగులైట్ ఆరిపోతుంది.



5 ఆ యూనిట్ దగ్గర లోనే వీవీప్యాట్ పరికరం నుంచి ఒక స్లిప్ కనిపిస్తుంది. ఓటు వేసిన అభ్యర్థి పేరు, గుర్తు కనిపిస్తాయి. ఇది కొద్ది క్షణాలపాటే కనిపిస్తుంది. ఓటరు తాను వేసిన ఓటు సదరు అభ్యర్థికి పడిందో లేదో తెలుసుకునేందుకు ఇదో అవకాశం.



- ఒకేసారి ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలు జరుగుతున్నందున రెండు బ్యాలట్ యూనిట్లు ఉంటాయి. ఇద్దరు అభ్యర్థులకు వేరువేరుగా ఓటు వేయాల్సి ఉంటుంది.
- ఓటు మీట నొక్కిన తరువాత బీప్ అనే శబ్దం రాకపోతే ఓటు పడలేదని గమనించాలి. సందేహమొచ్చినా తేడా ఉన్నట్లు గుర్తించినా వెంటనే మాక్ పోల్ స్లిప్ ద్వారా ఎన్నికల ప్రిసైడింగ్ అధికారికి ఫిర్యాదు చేయాలి.

ఓటరు గుర్తింపు కార్డులివే..



పోలింగ్ రోజున ప్రతి ఒక్కరు తమతో పాటు పోలింగ్ స్టేషన్‌కు విధిగా వ్యక్తిగత గుర్తింపు కార్డును తీసుకెళ్లాలి. లేని పక్షంలో ఎన్నికల అధికారులు తిరస్కరించడానికి అవకాశం ఉంది. ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఫొటో ఓటరు గుర్తింపుకార్డు లేదా 12రకాల కార్డులను మాత్రమే ఎన్నికల అధికారులు పరిగణనలోకి తీసుకున్నారు. ఓటరు ఐడీ (ఎపిక్‌కార్డు) లేని వారు ఈ 12 రకాల కార్డులలో ఏదో ఒకకార్డు ద్వారా ఓటుహక్కు వినియోగించుకోవచ్చు.

1. ఇండియన్ పాస్‌పోర్టు 2. ఆధార్‌కార్డు 3. డ్రైవింగ్ లైసెన్సు 4.సర్వీసు గుర్తిపు కార్డు(కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలు/ పీఎస్‌యూలు/ పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు తమ ఉద్యోగులకు జారీ చేసినవి) 5. పాస్‌బుక్ (ఫొటోతో పాటు బ్యాంకు/ పోస్టాఫీసుల్లో జారీ చేసినవి) 6. పాన్‌కార్డు 7. స్మార్ట్‌కార్డు(కార్మిక మంత్రిత్వ శాఖ పథకం కింద జారీ చేసినవి) 8. ఉపాధి హామీపథకం జాబ్‌కార్డు 9. ఆరోగ్య భీమా స్మార్ట్ కార్డు (కార్మిక మంత్రిత్వశాఖ పథకం కింద జారీ చేసినవి) 10. ఫోటో పింఛను పత్రం 11. ప్రత్యేక వైకల్యం కార్డు(కేంద్ర ప్రభుత్వం జారీచేసింది) 12. అధికారిక గుర్తింపు కార్డు(ఎంపీలు/ఎమ్మెల్యేలు/ఎమ్మెల్సీలకు జారీ చేసినవి)

- తిరుపతి (నేరవిభాగం)/తిరుపతి(కలెక్టరేట్)

జన చైతన్యం



ఎన్నికల పోరు 'క్లైమాక్స్'కు చేరింది. సోమవారం పోలింగ్ జరగనుంది. నామినేషన్ల నుంచి పోలింగ్‌కు సమీపించే కొద్దీ జిల్లాలో ఫ్యాను స్పీడు తగ్గింది. సైకిల్ జోరు పెరిగింది. ప్రభుత్వంపై నెలకొన్న వ్యతిరేకత.. కూటమి నేతల ఐక్యత.. ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణతో టీడీపీ అభ్యర్థుల్లో గెలుపు ధీమా కనిపిస్తోంది. అదే సమయంలో పంచాయతీలు, మున్సిపాలిటీలను జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేయడంపై అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఆగ్రహంతో ఉన్నారు. ఇన్నాళ్లు తమకు ప్రాధాన్యం లేదని గ్రామస్థాయి నాయకత్వమూ గుర్రుగా ఉంది. ప్రజల నుంచీ వ్యతిరేకత ఎదురవుతోంది. ఈ పరిణామాలన్నీ వైసీపీ అభ్యర్థులకు ఆందోళన కలిగిస్తున్నాయి. చివరి ప్రయత్నంగా పెద్ద ఎత్తున డబ్బు, మద్యం పంపిణీపై దృష్టి పెట్టారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

మారిన రాజకీయ సమీకరణాలు

2019 ఎన్నికల్లో జిల్లాలోని కుప్పం మినహా మిగిలిన స్థానాలన్నీ వైసీపీకే దక్కాయి. ఇప్పుడు సమీకరణాలు మారాయి. టీడీపీకి తోడుగా జనసేన, బీజేపీ కలిసి కూటమిగా ఏర్పడడం, ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉన్నాయి. ఇక, గతానికి భిన్నంగా చంద్రబాబు ముందస్తుగా అభ్యర్థుల్ని ప్రకటించారు. వీరంతా ప్రచారాల్లో దూసుకుపోతున్నారు. వైసీపీ అభ్యర్థులకు ఏమాత్రం తగ్గకుండా అన్నివిధాలా ముందంజలో ఉన్నారు. ఈ పరిణామాలతో టీడీపీ బలంగా మారింది. దీంతో అన్ని అసెంబ్లీ స్థానాల్లోనూ టీడీపీ శ్రేణులు గెలుపుపై ధీమాగా ఉన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు



చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన నగరి వైసీపీ నేతలు

ప్రభుత్వం మీదున్న వ్యతిరేకత, కూటమికి లభిస్తున్న ఆదరణతో వైసీపీ నుంచి టీడీపీ లోకి పెద్దఎత్తున చేరికలు జరిగాయి. చిత్తూరులో మాజీ ఎమ్మెల్యేలు సీకే బాబు, ఏఎస్ మనోహర్, ఆర్.గాంధీ చేరారు. నగరిలో శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్, చక్రపాణిరెడ్డి, వడమాలపేట జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఏలుమలై, విజయపురం నాయకులు లక్ష్మీపతిరాజు, రెడ్డివారి భాస్కర్‌రెడ్డి తదితరులు వైసీపీని వీడారు. పలమనేరు నియోజకవర్గంలోని పెద్దపంజాణి మాజీ ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి టీడీపీ చేరారు. పుంగనూరులో టీడీపీ నుంచి రెండు సార్లు పోటీ చేసి 2019లో వైసీపీ చేరిన వెంకట రమణారాజు సొంతగూటికే చేరారు. వీరంతా టీడీపీ ప్రచారాల్లో ముందుకు సాగుతున్నారు. ఇక, అన్ని నియోజకవర్గాల్లోనూ వందల కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి మారిపోయాయి.

- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, డిప్యూటీ సీఎం నారాయణస్వామి మేనల్లుడు రమేష్‌బాబు వైసీపీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. పూతలపట్టు, జీడీనెల్లూరులలో కాంగ్రెస్ అభ్యర్థులుగా బరిలోకి దిగారు.
- గత ఎన్నికల్లో పుంగనూరు నుంచి టీడీపీ తరఫున పోటీ చేసిన అనీషారెడ్డి దంపతులు.. పూతలపట్టు, జీడీనెల్లూరులో పోటీ చేసిన లలితకుమారి, హరికృష్ణ వైసీపీలో చేరారు. వీరెవరూ ఆ పార్టీలో క్రియాశీలకంగా కనిపించలేదు.

'క్లైమాక్స్'కు ఎన్నికల పోరు

- నేడు పోలింగ్ ● ప్రభుత్వంపై వ్యతిరేకత.. కూటమికి ఆదరణ
- జిల్లాలో సైకిల్ జోరు.. వైసీపీ బేజారు
- నమ్మకంలేని చోట్ల ఎక్కువ నగదు, మద్యం పంపిణీ

ప్రచారాల్లో టీడీపీ ముందంజ



సోదరుడితో కలిసి కుప్పంలో భువనేశ్వరి ప్రచారం

వైసీపీ అభ్యర్థులతో పోల్చుకుంటే జిల్లాలో టీడీపీ అభ్యర్థులు ప్రచారాల్లో ముందంజలో ఉన్నారు. ఈసారి ఎట్టిపరిస్థితుల్లోనూ గెలవాలనే పట్టుదల నేతలు, శ్రేణుల్లో కనిపిస్తోంది. ప్రతి ఇంటికీ వెళ్లి ఓట్లడిగారు. కుప్పంలో చంద్రబాబు తరఫున ఆయన సతీమణి భువనేశ్వరి అట్టహాసంగా నామినేషన్ వేయడంతో పాటు రెండుసార్లు నియోజకవర్గంలో ప్రచారం చేశారు. పుంగనూరులో మాజీ సీఎం కిరణ్ చంద్రబాబుతో కలిసి ఓసారి, చల్లా బాబు నామినేషన్ సమయంలో మరోసారి ప్రచారం చేసి పెద్దిరెడ్డి మీద తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. నగరిలో వైసీపీ అసంతృప్తుల్ని బుజ్జగించేందుకే రోజాకు సమయం సరిపోయింది. ఇంటింటి ప్రచారాలు చేయలేకపోయారు. వడమాలపేట మండలం వేమాపురం, ఎస్‌బీఆర్ ఆదిఆంధ్రవాడ గ్రామాల్లో రోజాను ప్రచారం చేయకుండా అడ్డుకున్నారు. ఇక్కడ గాలి భానుప్రకాష్ ఏడాదిగా ఇంటింటి ప్రచారం చేశారు. జీడీనెల్లూరులో టీడీపీ, వైసీపీ వర్గాలు జోరుగా ప్రచారం చేసుకున్నాయి.

అగ్రనేతల ప్రచారం



చంద్రబాబు: జిల్లాలో టీడీపీ అధినేత చంద్రబాబు అందరికంటే ఎక్కువ ప్రాంతాల్లో పర్యటించారు. బహిరంగ సభలు నిర్వహించారు. మార్చి 25, 26 తేదీల్లో కుప్పం, 27న పలమనేరు, పుత్తూరు ప్రాంతాల్లో, మే 7న పుంగనూరులో, మే 11న చిత్తూరులో ప్రచారం చేశారు.



జగన్: ఏప్రిల్ 3న పూతలపట్టులో సిద్ధం బహిరంగ సభ, మే 4న పలమనేరులో, మే 10న పుత్తూరులో ప్రచార సభల్లో పాల్గొన్నారు.



పీసీసీ అధ్యక్షురాలు షర్మిల: ఏప్రిల్ 15న కార్వేటినగరం, పలమనేరు, బంగారుపాళ్యం ప్రాంతాల్లో పర్యటించారు.

నందమూరి బాలకృష్ణ: ఏప్రిల్ 30న బంగారుపాళ్యం, చిత్తూరులో ప్రచార సభలను నిర్వహించారు.



పంపకాల్లో వైసీపీ ముందుభాగాన..

ఈ ఐదేళ్ల అధికారంలో ఉన్న వైసీపీ నేతలు.. క్వారీలు, ఇసుక, కబ్జాలు, కర్ణాటక మద్యం వ్యాపారం వంటి దందాలకు పాల్పడ్డారు. ఈ అక్రమార్జనతో ఓటర్లకు పెద్దఎత్తున డబ్బులు పంపిణీ చేశారు. ముఖ్యంగా కుప్పం చరిత్రలో ఎప్పుడూ లేనంతగా ఓటుకు రూ.4 వేలు ఇస్తున్నారు. జిల్లాలోనే ఇది అత్యధికం. ఇక్కడ టీడీపీ రూ.2 వేలకే పరిమితమైంది. పుంగనూరులోనూ వైసీపీ రూ.3 వేలు చొప్పున ఇవ్వగా, టీడీపీ రూ.1500 ఇచ్చింది. నగరిలోనూ టీడీపీ రూ.వెయ్యి ఇస్తే.. వైసీపీ రూ.2 వేలు చొప్పున ఇచ్చింది. పలమనేరు, చిత్తూరులో రూ.2 వేలు, పూతలపట్టు, జీడీనెల్లూరులో రూ.1500 చొప్పున ఇరుపార్టీలూ పంపిణీ చేశాయి.

చంద్రబాబు హామీలు

- కుప్పంలో హంద్రీనీవా ప్రాజెక్టును పూర్తి చేసి నీళ్లు అందిస్తా.
- పలమనేరులో కైగల్ ప్రాజెక్టు, గంగనసరస్సు, పలు కాలేజీలు, గతంలో రద్దయిన పనుల పునరుద్ధరణ.
- నగరిలో మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, గాలేరు- నగరి ప్రాజెక్టు పూర్తి
- పుంగనూరులో ఐటీ టవర్, మైనార్టీ కాలేజీ, చింతపండు ప్రాసెసింగ్ యూనిట్, మిల్క్ డెయిరీలు
- చిత్తూరులో యూనివర్సిటీ, అడవిపల్లె రిజర్వాయర్ నుంచి నగరానికి నీటి సరఫరా

జగన్ దండాలు

ప్రచార సభల్లో జగన్ తన గురించి గొప్పలు చెప్పడానికి.. విపక్షాలను తిట్టడానికే ప్రాధాన్యమిచ్చారు. స్థానికాంశాలను ప్రస్తావించలేదు. ఎలాంటి హామీలివ్వకుండా దండాలతో సరిపెట్టారు.

- చెరకు రైతులను ఆదుకుంటామని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కార్వేటినగరంలో హామీ ఇచ్చారు.

అడిగినంత మద్యం అందించిన వైసీపీ

ఓటర్లకు డబ్బుతో పాటు మద్యం పంపకాల్లోనూ వైసీపీ అభ్యర్థులే ముందంజలో ఉన్నారని చెప్పవచ్చు. అధికారం అండగా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వైసీపీ అభ్యర్థులు భారీగా మద్యం తెచ్చుకున్నారు. మామిడి తోపుల్లో డంప్ చేసి పెట్టుకున్నారు. అడిగిన వాళ్లకు అడిగినంత మద్యం పంపిణీ చేశారు. ముఖ్యంగా నగరిలో రోజా మీద వ్యతిరేకత ఉండడంతో ఆమె డబ్బుతో పాటు లిక్కర్ కూడా పెద్దఎత్తున ఇచ్చారు. జీడీనెల్లూరులో ఇరుపార్టీలూ క్వార్టర్ చొప్పున అందించాయి.

కరెంటు పోయినా ఈవీఎం ఓకే

పోలింగ్ సమయంలో కరెంటు పోతే ఈవీఎం పనిచేయదా? ఓటు వేసే సమయంలో కరెంటు పోతే ఎలా? సోమవారం నాటి పోలింగ్ నేపథ్యంలో చాలా మంది ఓటర్లకు వచ్చే సందేహాలివి. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ రూపొందించిన ఈవీఎంలు విద్యుత్ కనెక్షన్లు లేకపోయినా పనిచేస్తాయి. సాధారణ 7.5 వోల్ట్ ఆల్కలిన్ పవర్‌ప్యాక్‌తో పనిచేస్తాయని ఆ కంపెనీలు ప్రకటించాయి.

● పోలింగ్ నాడు ఇలా..



ఈవీఎంలు మొరాయిస్తే...

ఓటింగ్ జరగాలంటే ఈవీఎంలో కంట్రోల్ యూనిట్ (సీయూ), వీవీప్యాట్, బ్యాలెట్ యూనిట్ (బీయూ).. మూడూ సక్రమంగా పనిచేయాలి. సీయూ, బీయూ పనిచేయకపోతే వాటితో పాటు వీవీ ప్యాట్‌ను మార్చి తనిఖీ చేస్తారు. సీయూ బ్యాటరీ, వీవీ ప్యాట్ పనిచేయకపోతే వాటినే మారుస్తారు. పోలింగ్ మధ్యలో మొరాయించినా, ఈవీఎంలకు మరమ్మతులు చేసినా.. పనిచేయకపోతే కొత్త ఈవీఎంలను ఏర్పాటు చేస్తారు. అప్పటివరకు పోలైన ఓట్ల వీవీప్యాట్లను భద్రపరుస్తారు. ఓట్ల లెక్కింపు అనంతరం వీవీ ప్యాట్లతో ఫలితాలు తారుమారు అయ్యే అవకాశం ఉంటేనే ఈ వీవీ ప్యాట్లను లెక్కిస్తారు. అలాగే వేసిన ఓటును ఏడు సెకన్ల వ్యవధిలో పరిశీలించుకునే అవకాశం ఓటరుకు లభిస్తుంది. ఏమైనా తేడా అనిపిస్తే ప్రిసైడింగ్ అధికారికి ఫిర్యాదు చేయొచ్చు.

ప్రత్యేక గుర్తులతో మార్కింగ్

ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రంలోకి వచ్చే ఓటర్లను మూడు రకాలు (పురుషులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లు)గా విభజించారు. ఓటు వేసేందుకు వచ్చిన ఓటరు ఆధారంగా అదనపు ప్రిసైడింగ్ ఓటరు జాబితాలో మార్కింగ్ చేస్తారు. పురుషులు వస్తే అడ్డగీత, మహిళలు వస్తే అడ్డగీతతో పాటు వారి ఓటరు క్రమ సంఖ్యకు రౌండప్ చేస్తారు. ట్రాన్స్‌జెండర్లు వస్తే అడ్డగీతతో పాటు వారి క్రమసంఖ్యకు స్టార్ గుర్తు వేస్తారు. ఈ విధానంతో కేటగిరీవారీగా పోలింగ్ శాతాన్ని లెక్కించడం సులువు అవుతుంది.

దివ్యాంగులకు ఉచిత రవాణా


దివ్యాంగులు ఓటుహక్కు వినియోగించుకోవడానికి ఎన్నికల సంఘం ఉచిత రవాణా సదుపాయాన్ని కల్పించింది. పోలింగ్ కేంద్రాల వద్ద వారికి సహాయం చేయడానికి సిబ్బందిని ఏర్పాటు చేశారు. పోలింగ్ గదిలోకి దివ్యాంగులు వెళ్లడానికి వీలుగా ర్యాంపులను నిర్మించారు. దివ్యాంగులకోసం 'సాక్ష్యం' అనే యాప్‌ను ఎన్నికల సంఘం రూపొందించింది. ఆ యాప్‌ను వారి సెల్‌ఫోన్‌లో ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని రిక్వెస్ట్ పంపితే వారికి ఉచిత రవాణా, సిబ్బంది సదుపాయం కల్పిస్తారు.

- చిత్తూరు కలెక్టరేట్

రెండు గంటలకోసారి పోలింగ్ శాతం

పోలింగ్ ప్రారంభించిన తర్వాత ప్రతి రెండు గంటలకు ఒకసారి అధికారులు పోలింగ్ శాతాన్ని వెల్లడిస్తారు. మార్కింగ్ చేసిన జాబితా, ఓటరు స్లిప్పులు, సీయూ లెక్కలను సరిచూసిన తర్వాత పోలింగ్ శాతాన్ని ప్రకటిస్తారు. ఉదయం 9 గంటలు, 11, మధ్యాహ్నం 1 గంట, 3 గంటలకు, పోలింగ్ ముగిసిన తర్వాత తుదిశాతాన్ని వెల్లడిస్తారు. ప్రిసైడింగ్.. సెక్టోరల్ అధికారుల ద్వారా జిల్లా అధికారులకు నమోదైన పోలింగ్ శాతాన్ని చేరవేస్తారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారులు ఎప్పటికప్పుడు తెలియజేస్తారు.

'టెండర్డ్ ఓట్' కోసం సెక్షన్ 49 (పీ)



పోలింగ్ రోజు దొంగ ఓటు వల్ల లేదా ఇతర కారణాలతో ఓటు హక్కు కోల్పోయి ఉంటే.. తిరిగి దానిని సాధించుకునే హక్కును ఎన్నికల సంఘం 1961లో సెక్షన్ 49(పీ) ద్వారా కల్పించింది. ఈ సెక్షన్ ద్వారా ఓటు పొందాలనుకుంటే.. వారు ముందుగా ప్రిసైడింగ్ అధికారిని కలవాలి. ఓటు కోల్పోయిన వ్యక్తి తానేనని నిరూపించుకోవాలి. అందుకు ఓటరు గుర్తింపు కార్డు లేదా ఇతర గుర్తింపు పత్రాలను సమర్పించాలి. ఎన్‌ఆర్‌ఐలు అయితే పాస్‌పోర్టు చూపించాలి. అప్పుడు ప్రిసైడింగ్ అధికారి ఇచ్చే ఫారం-17(బీ)లో పేరు, సంతకం చేసివ్వాలి. అప్పుడు వెనుకవైపు తన సంతకంతో ఉన్న టెండర్ బ్యాలెట్ పేపర్‌ను పీవో ఇస్తారు. దానిపై మనకు నచ్చిన అభ్యర్థికి ఓటువేసి, ఆ బ్యాలెట్ పేపర్‌ను పీవోకు అందించాలి. ఆయన ప్రత్యేక కవర్లో ఆ ఓటును భద్రపరచి కౌంటింగ్ కేంద్రానికి పంపిస్తారు. ఇలా పొందే ఓటుహక్కును టెండర్డ్ ఓట్ అని పిలుస్తారు. సెక్షన్ 49(పీ) ద్వారా పొందే ఓటు హక్కును ఈవీఎం ద్వారా వేసేందుకు అనుమతివ్వరు. మొత్తం ఓట్లలో ఈ ఓటును అదనపు ఓటుగా గుర్తిస్తారు. కౌంటింగ్ రోజున మిగిలిన ఓట్లను లెక్కించిన తర్వాతే ఈ ఓటుకు ప్రాధాన్యం ఉంటుంది. గెలుపు ఓటములు ఈ ఓటు ద్వారా సాధ్యమవుతుందని భావించినప్పుడు మాత్రమే దీనిని లెక్కిస్తారు.

- చిత్తూరు కలెక్టరేట్

ఈవోను బదిలీ చేయండి

కార్వేటినగరం : వైసీపీకి తొత్తుగా పనిచేస్తున్న కార్వేటినగరం ఈవో మణిని తక్షణమే బదిలీ చేయాలని జీడీ నెల్లూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి యుగంధర్ డిమాండ్ చేశారు. కార్వేటినగరంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత గురువారం వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న టీటీడీ విజిలెన్స్ విభాగ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి విజయ్‌కుమార్‌ను ఎలా కొనసాగిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఈవో వెంటనే బదిలీ చేయాలని, లేదంటే ధర్నా నిర్వహిస్తామన్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ

జేసీ, ఆర్వో శ్రీనివాసులు

చిత్తూరు, మే 12: చిత్తూరు నియోజకవర్గంలో సోమవారం జరిగే పోలింగ్‌కు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు జేసీ, చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ ఆర్వో శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఆయన పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో సంబంధిత అధికారులతో కలిసి మీడియాతో మాట్లాడారు. చిత్తూరు నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో 23 కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోమవారం ఉదయం 4 గంటలకల్లా ఏపీవోలు, ఏపీవోలు, ఓపీవోలు, సిబ్బంది రెడీగా ఉండాలన్నారు. 5.30 గంటలకు ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఏఆర్వోలు శ్రీనివాసులురెడ్డి, అరుణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అలాగే చిత్తూరు నియోజకవర్గానికి సంబంధించి ఏర్పాట్లను ఎస్పీ మణికంఠ చందోలు, డీఎస్పీ ఏఎస్పీ అరీఫుల్లా, చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి పరిశీలించారు. ఈవీఎం, స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను తనిఖీ చేశారు.

పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేసిన జేసీ

గుడిపాల/ చిత్తూరు రూరల్, మే 12: మండలంలోని పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఆదివారం రాత్రి చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి పీవో, ఏపీవోలతో ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. రాత్రి అప్రమత్తంగా కేంద్రంలో ఉండాలని, ఎన్నికల సామాగ్రిని జాగ్రత్తగా చూసుకోవాలని పోలీసు అధికారులను సూచించారు. ఈ సందర్భంగా ఆయన పాపిశెట్టిపల్లి, చీలాపల్లి, 189 కొత్తపల్లి పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేశారు.

● చిత్తూరు రూరల్ మండలంలోని పచ్చనపల్లి, ముత్తుకూరు, 169 రామాపురం పోలింగ్ కేంద్రాలను జేసీ శ్రీనివాసులు పరిశీలించారు. అనంతరం అక్కడి ఓటర్లతో ఆయన మాట్లాడారు. గ్రామంలోని ఓటర్లందరూ నిర్భయంగా వందశాతం ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. సోమవారం సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కేంద్రాలను వదిలి బయటకు వెళ్ళరాదని అక్కడి అధికారులను సూచించారు.





మాట్లాడుతున్న జేసీ, ఆర్వో శ్రీనివాసులు, చిత్తూరు రూరల్ మండలం పచ్చనపల్లి పోలింగ్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న జేసీ శ్రీనివాసులు



చిత్తూరులోని పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు వెళుతున్న సిబ్బంది

ఎన్నికలకు సర్వం సిద్ధం

నగరి ఏప్రిల్12: నగరి నియోజకవర్గంలోని 231 పోలింగ్ బూత్‌లకు సంబంధించి ఎన్నికల సామగ్రితో అధికారులు ఆదివారం తరలివెళ్లారు. ఆర్వో వెంకటరెడ్డి మాట్లాడుతూ పోలింగు సమయంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా సిబ్బంది పనిచేయాలని సూచించారు. పక్షపాత ధోరణితో వ్యవహరిస్తే కఠినచర్యలు ఉంటాయన్నారు ఆయా పోలింగు కేంద్రాల వద్ద షామియానా వేసి సర్వం సిద్ధం చేశారు.

ఐరాల : ఐరాల మండల వ్యాప్తంగా 45 పోలింగ్ కేంద్రాలను, పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ఎస్టీఎఫ్ దళాలను మోహరించారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ

గంగాధరనెల్లూరు:గంగాధరనెల్లూరు హైస్కూల్లో ఏర్పాటుచేసిన ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఆదివారం ఉదయం 6గంటలకే ఎన్నికల ఆర్వో, అసిస్టెంట్ ఆర్వోతో పాటు పలువురు అధికారులు చేరుకుని కౌంటర్ల వద్ద ఏర్పాట●లను పరిశీలించారు. అనంతరం 8గంటల నుంచే పోలింగ్ అధికారులకు ఈవీఎంలతోపాటు ఎన్నికల సామగ్రికి సంబంధించిన వాటిని పోలింగ్ కేంద్రం వారీగా పిలిచి అందజేశారు. ఎన్నికల సామగ్రిని తీసుకున్న అధికారులు ఈవీఎంలు ఆన్ ఆఫ్ సక్రమంగా అవుతున్నాయా, టెక్నికల్ సమస్య ఏదైనా ఏర్పడుతోందా అనేది పరిశీలించుకున్నారు. మధ్యాహ్నం 2.30గంటల తర్వాత అధికారులతోపాటు సామగ్రిని బస్సుల ద్వారా వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు పోలీస్ బందోబస్తు నడుమ ఆదివారం సాయంత్రం తరలించేశారు.

డిస్ట్రిబ్యూషన్ కేంద్రం తనిఖీ

గంగాధరనెల్లూరు హైస్కూల్లో ఏర్పాటుచేసిన ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఆదివారం మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ కైలాష్ వాంఖేడ్ తనిఖీ చేశారు. ఆయన ఎన్నికల ఆర్వో వెంకటశివ దగ్గర డిస్ట్రిబ్యూషన్‌కు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.



జీడీ నెల్లూరులో ఈవీఎంలతోపాటు ఎన్నికల సామగ్రిని బస్సుల వద్దకు తీసుకెళుతున్న అధికారులు

ఓటుహక్కు వినియోగించుకోవాలి

ప్రతి ఓటరూ స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలని ఆర్వో సి.వెంకటశివ పిలుపునిచ్చారు. గంగాధరనెల్లూరు హైస్కూల్లో పోలింగ్ విధులకు వెళ్ళే అధికారులనుద్దేశించి ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో పోలింగ్ పూర్తి చేయాలన్నదే లక్ష్యంగా పనిచేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. పోలింగ్ విధులకు పీవోలు, అసిస్టెంట్ పీవోలు, ఓపీవోలు మొత్తం కలిపి 1834 హాజరయ్యారన్నారు.





నగరిలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం వద్ద సిబ్బంది, గంగాధరనెల్లూరులో పోలింగ్ విధులకు హాజరైన వివిధ శాఖల ఉద్యోగులు

గంగమ్మ నామస్మరణతో మార్మోగిన బోయకొండ



చౌడేపల్లె, మే12: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం గంగమ్మ నామస్మరణతో మార్మోగింది. ఉదయం ఆలయంలో అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి, అమ్మవారికి ప్రీతికరమైన వేపాకు తోరణాలతో ఆలయాన్ని అలంకరించారు. అమ్మవారికి అభిషేకాలు అర్చనలు చేసి స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే గాక తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తుల ఏర్పాట్లును ఆలయ ఈవో చంద్రమౌళిలు పర్యవేక్షించారు.

నేటి నుంచి అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

చౌడేపల్లె, మే12: స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 13 నుంచి 25 వరకు జరుగుతాయని ఆలయ అర్చకులు రాజశేఖర్ దీక్షితులు పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 13న గణపతి ప్రార్థన, అంకురార్పణ, 14న ధ్వజారోహణం, సింహవాహనం, 15న యాళి వాహనం, 16న శేషవాహనం, 17న రావణవాహనం, 18న నంది వాహనం, 19న గజవాహనం, కల్యాణోత్సవం, 20న రథోత్సవం, 21న అశ్వవాహనం, 22న హంస వాహనం, ధ్వజావరోహణం, 23న ప్రథమ శయనోత్సవం, 24న ద్వితీయ శయనోత్సవం, 25 ఊంజల సేవ ఉంటుందని వివరించారు.

గడ్డివామికి నిప్పు

రామకుప్పం, మే 12: రామకుప్పం మండలం సింగసముద్రం గ్రామానికి చెందిన దేవరాజ్ గడ్డివామికి శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దేవరాజు కుటుంబ సభ్యులు ఇటీవల వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. గడ్డివామిలో టీడీపీ వారు మద్యం నిల్వ ఉంచారన్న అనుమానంతో వైసీపీ వారే గడ్డివామికి నిప్పు పెట్టి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బాధితుడికి రూ.20 వేలు ఆస్తినష్టం సంభవించిందని ఆవేదన వ్యక్తం చేశారు.

రామానుజ సహస్రాబ్ది జయంత్యుత్సవాలు





కోదండరామాలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకబృందం, తేనుబండ వీరబ్రహ్మం ఆలయంలో రామానుజ అయ్యంగార్‌కు పూజలు

చిత్తూరు కల్చరల్, మే 12: స్థానిక కోదండరామాలయంలో ఆదివారం రామానుజ ట్రస్టు, నగర బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రామానుజ అయ్యంగార్ సహస్రాబ్ది జయంతి ఉత్సవాలు నిర్వహించారు. అర్చకులు వేణుగోపాల్ అర్చక బృందం స్వామివారికి అభిషేక పూజలు నిర్వహించి రామానుజ సన్నిధిలో గోష్టిగానం చేసారు. అదేవిధంగా నాళయర్ దివ్య ప్రబంధం ఏడు పాశురాలు పారాయణం చేసి, వేద సాత్తుమొర పఠించారు. ఇదిలా ఉండగా స్థానిక తేనెబండ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో నగర విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రామానుజ అయ్యంగార్ సహస్రాబ్ది జయంతి ఉత్సవాలు జరిగాయి. స్వామికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మల్లీ ఆచారి, లత, గోపి ఆచారి, వినాయకం ఆచారి, కృష్ణమాచారి, యశోదరచారి పాల్గొన్నారు.

కాణిపాకంలో ఆదిశంకరాచార్యుల జయంతి



ఐరాల(కాణిపాకం),మే 12: కాణిపాకంలో ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలను ఆదివారం ఆలయ అలంకార మండపంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆదిశంకరాచార్యుల చిత్రపటం ఉంచి విశేష పూజలు నిర్వహించారు. వేదపండితులు, అర్చకులు జగద్గురు ప్రపంచానికి అందించిన అమూల్యమైన సంపద గురించి తెలియజేశారు. భక్తులందరికి ఆదిశంకరాచార్యుల కృప కలగాలని పండితులు వేడుకున్నారు. కార్యక్రమంలో ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బీసీ నేత ఇంట్లో రెండోసారి తనిఖీలు


చిత్తూరు సిటీ, మే 12: టీడీపీ బీసీ నేతలే టార్గెట్‌గా వారి ఇళ్లలో ఎన్నికల అధికారులు, పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు.చిత్తూరు సంతపేటలో నివాసముంటున్న చిత్తూరు కో ఆపరేటివ్ బ్యాంక్ మాజీ ఛైర్మన్, టీడీపీ సీనియర్ నేత పి.షణ్ముగం నివాసంలో ఎన్నికల అధికారులు, పోలీస్ సిబ్బంది శనివారం రాత్రి రెండోసారి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఏమీ దొరకకపోవడంతో వెనుదిరిగారు. ఈ సందర్భంగా షణ్ముగం మాట్లాడుతూ టీడీపీకి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక వైసీపీ నేతలు పోలీసులతో తమ నివాసాల్లో సోదాలు నిర్వహించి తమను అవమానపరచారని, ఎన్నికల్లో వారికి ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు.



షణ్ముగం నివాసంలో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

సార్వత్రిక ఎన్నికల బరిలో వీరే

చిత్తూరు (ఎంపీ)

టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్
		
దగ్గుమళ్ళ ప్రసాదరావు	ఎన్. రెడ్డెప్ప	ఎం. జగపతి

స్వతంత్రులు: 13 మొత్తం: 19

చిత్తూరు (అసెంబ్లీ)

టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్
		
జీసీ జగన్మోహన్	విజయానంద రెడ్డి	జి.టికారాం

స్వతంత్రులు: 6 మొత్తం: 13

పూతలపట్టు

టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్
		
మురళీమోహన్	సునీల్ కుమార్	ఎంఎస్ బాబు

స్వతంత్రులు: 6 మొత్తం: 12

గంగాధర నెల్లూరు

టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్
		
డాక్టరు థామస్	కృపాలక్ష్మి	రమేష్‌బాబు

స్వతంత్రులు: 3 మొత్తం: 11

నగరి

టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్
		
భానుప్రకాష్	ఆర్కే రోజా	రాకేష్

స్వతంత్రులు: 3 మొత్తం: 7

ఓటర్లకు రాజకీయ పార్టీల ప్రలోభాలు

పాలసముద్రం, మే 12: పోలింగ్‌కు ముందురోజైన ఆదివారం టీడీపీ, వైసీపీ నాయకులు ఓటర్లను ప్రలోభాలు పెట్టేందుకు నగదు పంపిణీ చేయడంతోపాటు భారీఎత్తున మద్యం పంపిణీ చేశారు. మండలంలో ఓటుహక్కును వినియోగించుకోవడానికి బెంగుళూరు, చెన్నై నుంచి ఐటీ ఉద్యోగులు, వ్యాపారస్తులు ఎక్కువ మంది తమ స్వగ్రామాలకు చేరుకున్నారు. తమ స్వగ్రామంలో వున్న వారి చేత ఎక్కువశాతం టీడీపీకి ఓటు వేయించడానికి వారు మందు పార్టీలు, విందులతో సమావేశపరిచారు. ఓటర్లను ప్రలోభపెట్టడానికి ఇరుపార్టీల నాయకులు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు.

పిచ్చికుక్కల దాడిలో 10 మేకలు మృతి



వెదురుకుప్పం, మే12: పిచ్చికుక్కల దాడిలో పది మేకలు చనిపోయాయని గంగిరెడ్డి ఇండ్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. వెదురుకుప్పం మండలం గంగిరెడ్డిఇండ్లుకు చెందిన టి.జయరామిరెడ్డి మేకలపై పిచ్చికుక్కలు దాడి చేయడంతో పది చనిపోయాయని తెలిపారు. వాటి విలువ సుమారు రూ.1.50లక్షలు ఉంటుందని చెప్పారు. పిచ్చికుక్కల కట్టడికి అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'పాత్రికేయుల్ని బెదిరించడం తగదు'

చిత్తూరు,మే12(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎమ్మెల్యే కరుణాకర్‌రెడ్డి పాత్రికేయుల మీద ఆరోపణలు చేసి బెదిరించడం తగదని చిత్తూరు ప్రెస్‌క్లబ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. శనివారం తిరుపతిలో ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి.. ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఉమామహేశ్వర్‌రావు, విలేకరి నరేంద్ర మీద ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. వెంటనే కరుణాకర్‌రెడ్డి పాత్రికేయులకు క్షమాపణలు చెప్పాలని ప్రెస్‌క్లబ్ ప్రధానకార్యదర్శి అశోక్‌కుమార్ అన్నారు.

వెదురుకుప్పం : ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్ఎం ఉమామహేశ్వరరావు, విలేకరి నరేంద్రను ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి దూషించి, బెదిరింపులకు పాల్పడడం తగదని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ అన్నారు. తమపై వక్రీకరించి వార్తలను ప్రచురిస్తే వాటికి ఖండన ఇవ్వాలని సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈవోను బదిలీ చేయండి

కార్వేటినగరం, మే 12: వైసీపీకి తొత్తుగా పనిచేస్తున్న కార్వేటినగరం ఈవో మణిని తక్షణమే బదిలీ చేయాలని జీడీ నెల్లూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి యుగంధర్ డిమాండ్ చేశారు. కార్వేటినగరంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత గురువారం వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న టీటీడీ విజిలెన్స్ విభాగ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి విజయ్‌కుమార్‌ను ఎలా కొనసాగిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఈవో వెంటనే బదిలీ చేయాలని, లేదంటే ధర్నా నిర్వహిస్తామన్నారు.

చంద్రబాబును కలసిన ఎల్‌బీఐ లోకేష్ రెడ్డి



చిత్తూరుసిటీ, మే12: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబును ఎల్‌బీఐ బిల్డర్స్ అధినేత లోకేష్ రెడ్డి దంపతులు శనివారం తిరుపతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. లోకేష్ రెడ్డి మాట్లాడుతూ కూటమి భారీ మెజారిటీతో గెలిచి, చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

నియోజకవర్గకేంద్రంలో విద్యుత్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు

ఎస్ఈ ఎం.కృష్ణారెడ్డి

తిరుపతి(ఆటోనగర్), మే 12: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సోమవారం జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా అన్ని విద్యుత్ డివిజన్ కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని ఎస్ఈ ఎం.కృష్ణారెడ్డి తెలిపారు. జిల్లాలో 14 నియోజకవర్గాల్లో వున్న విద్యుత్ డివిజన్ కేంద్రాల్లో వున్న కంట్రోల్ రూమ్‌ల సెల్ నెంబర్లు ఇలా వున్నాయి. తిరుపతి 94408 17413, చంద్రగిరి 94408 17414, 7382623214, శ్రీకాళహస్తి 94408 17414, 94408 17413, సత్యవేడు 94408 17421, నగరి 94408 17421, జీడీ నెల్లూరు 94408 17421, 73827 74644, చిత్తూరు 73827 74644, పూతలపట్టు 94910 52934, పలమనేరు 80740 51992, పుంగనూరు 80740 51992, మదనపల్లి 95504 34691, తంబళ్లపల్లి 95504 34691, పీలేరు 73826 23214, కుప్పం రెస్కో 1800425505505 నెంబర్లతో పాటు తిరుపతి ఎస్ఈ కార్యాలయంలో కూడా మరోనెంబరు 94408 17412ను ఏర్పాటు చేశామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే వెంటనే ఈ నెంబర్లకు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల్లో నిరంతరం విద్యుత్ సరఫరా వుండేవిధంగా చర్యలు తీసుకున్నామని ఎస్ఈ తెలిపారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.67 కోట్లు

తిరుమల, మే 12, (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.67 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి, ఆదివారం ఉదయం ప్రకటించింది. శనివారం 76,945 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా. 33,844 మంది తలనీలాలు సమర్పించారు.

చికెన్, మందుకు భలే గిరాకీ..!

పాకాల, మే 12: ఎన్నికల నేపథ్యంలో మండలంలో ఆదివారం చికెన్‌కు, మద్యం బాటిళ్లకు గిరాకీ పెరిగింది. ఎన్నికల తాయిలాలుగా నగదు పంపకాలతో చేతినిండా డబ్బుంది గానీ మద్యం షాపులు లేకపోవడంతో మందుబాబులు ఇబ్బందులు పడ్డారు. మూడు రెట్లు చెల్లించి పాండిచ్చేరి, కర్ణాటక మద్యాన్ని కొనుగోలు చేశారు. రాజకీయ పార్టీల నాయకులు ముందస్తుగా నిల్వ ఉంచుకున్న మద్యం బాటిళ్లతో పాటు కొన్ని గ్రామాలకు ఇంటింటికీ కేజీ చికెన్ అందజేసి ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి పోటీ పడ్డారు. ఇప్పటికే నగదు, చీరలు, స్వీటు బాక్స్‌లు లాంటి తాయిలాలు పంచిపెట్టారు. ఇరు పార్టీల నుంచి తాయిలాలు అందుకున్న ఓటర్లు ఎవరికి ఓటేస్తారో అంతుబట్టడం లేదు.

తిరుమలలో పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి


ఎస్వీ హైస్కూల్ వద్ద చేపట్టిన ఏర్పాట్లు

తిరుమల, మే 12 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ఎస్వీ హైస్కూల్‌లో అధికారులు ఐదు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశా రు. బాలాజీనగర్‌తో పాటు ఆర్బీ సెంటర్‌లో నివసించే స్థానిక వ్యాపారుల తో పాటు సీ, డీ, న్యూ సీ టైప్ వంటి క్వార్టర్స్‌లో ని వసించే ఉద్యోగులతో కలిపి మొత్తం 5,347మంది ఓటర్లు ఉన్నారు. 1వ బూత్‌లో 958, 2వ బూత్‌లో 1,284 మంది, 3వ బూత్‌లో 1,407 మంది, 4వ బూత్‌లో 902 మంది, ఐదో బూత్‌లో 796 మంది చొప్పున ఓట్లు వేసేందుకు అధికార యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేసింది. నిబంధనలను ఉల్లఘించకుండా భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేశారు.

శ్రీవారి ఆలయంలో భాష్యకారుల సాత్తుమొర



తిరుమల, మే 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం భాష్యకార్ల సాత్తుమొర ఘనంగా జరిగింది. రామానుచార్యులు జన్మించిన వైశాఖ మాస ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఏటా భాష్యకార్ల సాత్తుమొర నిర్వహిస్తారు. ఈసందర్భంగా ఉదయం భాష్యకార్ల వారిని ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగించారు. తర్వాత నడకదారిలోని భాష్యకార్ల సన్నిధిలో వైభవంగా అభిషేకం చేపట్టారు. సాయంత్రం సహస్రదీపాలంకరణ సేవ తర్వాత శ్రీవారి ఉత్సవమూర్తులు, భాష్యకార్లవారిని వేర్వేరుగా మాడవీధుల్లో ఊరేగించారు. రాత్రి భాష్యకార్ల సన్నిధిలో సాత్తుమొర నిర్వహించారు. అనంతరం ప్రత్యేక ఆభరణాలతో సళ్లింపు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జీయర్‌స్వాములు, అధికారులు పాల్గొన్నారు.

కోదండరామాలయంలో ఘనంగా పుష్పయాగం



తిరుపతి (కల్చరల్), మే 12: నగరంలోని కోదండరామాలయంలో ఆదివారం పుష్పయాగం ఘనంగా జరిగింది. ఉదయం 9 గంటలకు ఆచార్య రుత్విక్ వరణం నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి 11 వరకు సీతాలక్ష్మణ సమేత కోదండ రామస్వామికి స్నపన తిరుమంజనం జరిగింది. సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్య ఆలయంలోని ఊంజల మండపంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య పుష్పయాగం జరిగింది. ఇందులో 11 రకాల పుష్పాలు, 6 రకాల ఆకులు, మొత్తం 3 టన్నుల పూలతో స్వామి వారిని అభిషేకించారు. ఈ పూలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడుకు చెందిన దాతలు అందజేశారు. చివరగా రాత్రి 7 గంటలకు సీతారాములు ఆలయమాడవీధుల్లో విహరించి భక్తులకు కనువిందుచేశారు.

మోక్షమార్గం తెలిపిన రామానుజులు


రామానుజాచార్యుల గురించి వివరిస్తున్న రాజగోపాలన్

తిరుపతి(కల్చరల్), మే 12: అష్టాక్షరీ మంత్రంతో సామాన్యులకు కూడా మోక్షమార్గాన్ని ఉపదేశించిన గొప్ప తాత్త్వికవేత్త రామానుజులు అని కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆచార్యులు కె.రాజగోపాలన్ అన్నారు. టీటీడీ, ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో భగవద్ రామానుజాచార్య అవతార మహోత్సవాల్లో చివరి రోజు, ఆదివారం సాయంత్రం 6 గంటలకు అన్నమాచార్య కళామందిరంలో జరిగిన సభలో రామానుజాచార్యులు - తిరుమల కైంకర్యాలు అనే అంశంపై కె.రాజగోపాలన్ ప్రసంగించారు. రామానుజులు సాక్షాత్తు ఆదిశేషుడి అవతారంగా పేర్కొన్నారు. తిరుపతిలోని గోవిందరాజ స్వామి ఆలయం, తిరుమలలో శ్రీవారి ఆలయంలో రామానుజులు ఏర్పాటు చేసిన నిత్యకైంకర్య వ్యవస్థ ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. అనంతరం అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు రాజ్యలక్ష్మీ బృందం నిర్వహించిన గాన కచేరి ఆహూతులను అలరించింది. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు అధికారి కోకిల, డీపీపీ కోఆర్డినేటర్ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

గోవిందరాజస్వామి ఆలయంలో భాష్యకార్ల ఉత్సవం



తిరుపతి (కల్చరల్), మే 12: నగరంలోని గోవిందరాజ స్వామి ఆలయంలో ఆదివారం భాష్యకార్ల ఉత్సవం (రామానుజాచార్యులు) ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 7 గంటల నుంచి 8 వరకు భాష్యకార్లవారిని ఆలయంలోని చిన్నమాడ వీధుల్లో ఊరేగించారు. తిరిగి సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 7 వరకు పెద్దమాడవీధుల్లో ఊరేగింపు జరిగింది. అనంతరం ఆలయంలో తిరుమంజనం, సాత్తుమొర, ఆస్థానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమల చిన్న జీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో మునికృష్ణారెడ్డి, ఇతర అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

ప్రశాంత పోలింగ్‌కు సహకరించాలి

- 1962 మందితో పుంగనూరు ఎన్నికల విధులు
- కేంద్రబలగాలు, వెబ్‌కాస్టింగ్‌తో పోలింగ్
- పుంగనూరు ఈఆర్వో మధుసూదన్‌రెడ్డి



పుంగనూరు, మే 12: పుంగనూరు నియోజకవర్గంలో సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించడానికి పోలింగ్ అధికారులు, సిబ్బంది అప్రమత్తతతో వ్యవహరించాలని ఈఆర్వో వై.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పుంగనూరు అసెంబ్లీ, రాజంపేట పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలను పీవోలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పుంగనూరు, రూరల్, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల్లో 262 పోలింగ్ కేంద్రాల్లో 265 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ అధికారి, సహాయకులుగా ఎన్నికల విధులకు 1962 మందిని నియమించామని పేర్కొన్నారు. ఈవీఎంల సమస్య, తదితర ఇబ్బందులు ఎదురైతే వెంటనే సమాచారం ఇవ్వాలని, రిజర్వులో ఉన్న ఈవీఎంలు వినియోగించాలన్నారు. పోలింగ్ ముగియగానే పోలింగ్ సిబ్బంది, పోలీసులు ఎన్నికల సామగ్రితో తిరిగి కౌంటింగ్ కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. 100 పోలింగ్ కేంద్రాలను అత్యంత సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి కేంద్రబలగాలు, పోలీస్ బందోబస్తు చేపట్టడంతో బాటు పోలింగ్‌ను వెబ్‌కాస్టింగ్, వీడియో రికార్డింగ్‌తో నమోదు చేస్తున్నట్లు వివరించారు. పీవోలు 289మంది, ఏపీవోలు 312మంది, ఓపీవోలు 1245మంది, సెక్టోరియల్ ఆఫీసర్లు 31మంది, మైక్రో అబ్జర్వర్లు 116మంది ఉంటారని, 28 రూట్లు, 8 సెక్టార్ రూట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పుంగనూరులో భారీ పోలీస్ బందోబస్తు

పుంగనూరులో ట్రైనీ ఎస్పీ, ఏఎస్పీ సుబ్బరాజు పర్య వేక్షణలో డీఎస్పీ మహబూబ్ బాషా, ఆరుగురు సీఐలు, ఏడుగురు ఎస్ఐలు, 45మంది ఏఎస్ఐలు, సీఆర్పీఎఫ్, స్పెషల్ ప్రొటక్షన్ ఫోర్స్, తమిళనాడు పోలీసులతో బాటు నియోజకవర్గం, జిల్లాలో పనిచేసే పోలీసులు 638 మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.




ఈవీఎంలు పరిశీలిస్తున్న పోలింగ్ అధికారులు ● ఈవీఎంలతో వెలుతున్న పోలింగ్ అధికారులు ● ఎన్నికల విధుల కోసం బస్సులు ఎక్కుతున్న పోలింగ్ సిబ్బంది

పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది



కుప్పం డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఎన్నికల సిబ్బంది, డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న స్టేట్ అబ్జర్వర్ సాదిక్ అలీ

కుప్పం, మే 12: పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది ఆదివారం తరలిపోయారు. కుప్పం నియోజకవర్గానికి సంబంధించి కుప్పంలోని ఎంఎఫ్‌సీ ప్రభుత్వ జూనియర్ కళాశాలను అధికారులు డిస్ట్రిబ్యూషన్ కేంద్రంగా ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో మొత్తం 243 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాలకు అవసరమైన మేర సిబ్బందిని నియమించారు. నియోజకవర్గ ఎన్నికల అధికారి జి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పోలింగ్ సిబ్బందికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఉదయం 7 గంటలకే పోలింగ్ సిబ్బంది కేంద్రానికి చేరుకున్నారు. తమకు అప్పగించిన పోలింగ్ సామగ్రిని సరిచూసుకున్నారు. ఇదంతా ముగిసేసరికి మధ్యాహ్నమైంది. మధ్యాహ్న బోజనం డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్దే అధికారులు ఏర్పాటు చేశారు. భోజనం చేసిన తర్వాత తమకు కేటాయించిన పోలింగ్ బూత్‌లకు సిబ్బంది తరలివెళ్లారు. నియోజకవర్గంలో మొత్తం 2,25,755 మంది ఓటర్లున్నారు. వీరిలో పురుషులు 1,12,519 మంది కాగా మహిళా ఓటర్లు 1,13,247 మంది ఉన్నారు. వీరంతా సోమవారం తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే ఓటింగ్ సాయంత్రం 6 గంటలకు ముగియనుంది. డీఎస్పీ శ్రీనాథ్ ఆధ్వర్యంలో శాంతిభద్రతల పరిరక్షణకోసం సిబ్బంది నియమితులయ్యారు. వారు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలలో ఈ సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు నియోజకవర్గం కావడంతో ఎన్నికల కమిషన్ ప్రత్యేక దృష్టి సారించింది. పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసింది. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా రాష్ట్ర, కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి వెళుతుంది. వెంటనే చర్యలు తీసుకుంటారు. కాగా కుప్పం ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఆదివానం రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు సాదిక్ అలీ తనిఖీ చేశారు. ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేశారు.

విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేయండి

కుప్పం నియోజకవర్గ వ్యాప్తంగా పోలింగ్‌కు తగా విద్యుత్తు సరఫరా ఏర్పాట్లు చేసినట్లు కుప్పం రెస్కో మేనేజింగ్ డైరెక్టర్ సీఎం.ప్రభాకర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో ఎక్కడ ఎటువంటి విద్యుత్తు సమస్యలు తలెత్తినా టోల్ ఫ్రీ నెంబర్ 1800425505505కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలియజేశారు. వెంటనే ఆయా సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు.

శ్రీవారి పాదాల మార్గంలో బోల్తాపడిన టెంపో

నలుగురు భక్తులకు తీవ్రగాయాలు


ప్రమాదానికి గురైన వాహనం

తిరుమల, మే 12 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ప్రముఖ సందర్శనీయ ప్రదేశమైన శ్రీవారి పాదాల మార్గంలో ఆదివారం ఓ టెంపో ట్రావెలర్ వాహనం బోల్తాపడింది. ఈ ప్రమాదంలో నలుగురు భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. భక్తుల వివరాల మేరకు.. కర్ణాటకలోని హుబ్లీకి చెందిన యమునప్ప ఆధ్వర్యంలో దాదాపు 20 మంది భక్తులు శ్రీవారి దర్శనార్థం ఆదివారం తిరుమలకు వచ్చారు. ఉదయం దర్శనం ముగించుకుని తిరుమలలో శ్రీవారి పాదాల సందర్శన నిమిత్తం టెంపోట్రావెలర్ వాహనాన్ని మాట్లాడుకుని వెళ్లారు. తిరిగి వచ్చే సమయంలో ఒక్కసారిగా వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మర్రెమ్మ, విజయలక్ష్మి, నీలమ్మ, సుధా తీవ్రంగా గాయపడ్డారు. మిగిలిన భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తరలించి, చికిత్స అందించారు. వాహనం బ్రేక్ ఫెయిల్ కావడంతోనే ప్రమాదం జరిగినట్టు డ్రైవర్ చెప్తుంటే.. సరైన కండీషన్‌లో వాహనం లేకపోవడంతోనే ప్రమాదం జరిగిందని భక్తులు ఆరోపించారు. డిల్లీ రిజిస్ట్రేషన్‌తో ఉన్న వాహనాన్ని తిరుమలకు తిప్పుతూ భక్తుల ప్రాణాలతో చెలగాటమాడటం ఎంతవరకు సమంజసమంటూ ఆగ్రహించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓటు వేసేందుకు గుర్తింపు కార్డు తప్పనిసరి


కల్లూరులో పోలింగ్ ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

కల్లూరు, మే 12: పులిచెర్ల మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రా లలో సోమవారం జరగనున్న పోలింగ్‌కు ఎన్ని కల అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నిర్దిష్ట సమయానికి పోలింగ్ ప్రారంభమ వుతుందని ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సంబంధిత అధికారులు తెలిపారు. ఓటు హక్కు వినియోగించుకునే ప్రతి ఒక్కరూ తమ వెంట గుర్తింపు కార్డు తీసుకురావాలని తెలిపారు.

ఓటెయ్యడం మరువకండి

ఓటు హక్కును అందరూ వినియోగించుకోవాలని కోరుతూ చిల్లకూరు మండలం ఏరూరు గ్రామానికి చెందిన సైకత శిల్పి మంచాల సనత్‌కుమార్ ఆదివారం సముద్రతీరంలో ఈ సైకత శిల్పాన్ని రూపొందించారు. సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకోవాలనేదే ఈ శిల్పం వుద్దేశమన్నారు.

- చిల్లకూరు





మాకొద్దీ నాసిరకం చీరలు

రేణిగుంట మండలం విప్పమాను పట్టెడ ఎస్టీ కాలనీలో ఆదివారం రాత్రి గ్రూపు లీడరు ఇంటివద్ద వైసీపీ నాయకులు చీరలు అందరికీ పంచమని ఇచ్చారు.ఆమె ఇండ్ల వద్ద కెళ్లి పంచగా వాటిని నాసిరకమంటూ రోడ్లో పడేసి మహిళలు నిరసన తెలిపారు.పైగా పట్టణంలో ఓటర్లకు మూడువేలిచ్చి మాకు 1500 మాత్రమే ఇస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

- రేణిగుంట

సదుం పోలింగ్ పైనే అందరి దృష్టి


సదుంలో కవాతు చేస్తున్న కేంద్ర బలగాలు (ఫైల్‌ఫోటో)

పుంగనూరు, మే12: రాష్ట్రంలోనే అత్యంత సమస్యాత్మక నియోజకవర్గం పుంగనూరులోని మంత్రి పెద్దిరెడ్డి సొంత మండలం సదుంలో సోమవారం జరిగే ఎన్నికల పోలింగ్‌పైనే అందరూ దృష్టి సారించారు. సార్వత్రిక ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలని, ప్రజలు ధైర్యంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, బీసీవై పార్టీ అభ్యర్థి రామచంద్రయాదవ్‌ల ఫిర్యాదు మేరకు కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా స్పందించి కేంద్ర బలగాలతోబాటు తమిళనాడు పోలీసులను పంపింది. పుంగనూరులోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ కెమెరాలతో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది.

మామిడి బోర్డు ఏర్పాటు చేయండి


పలమనేరులో గాలివానకు రాలిన మామిడి తోటలో రైతు మురగేష్

పలమనేరు, మే12 : ప్రతి ఏటా మామిడి రైతులు ప్రకృతి ప్రకోపంతో నష్టపోతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడికి దేశంలో ప్రసిద్ధిగాంచింది. ఇక్కడి మామిడికి దేశ వ్యాప్తంగా మంచిపేరుంది. ఎక్కువ మెట్టభూములు ఉండ డంతో పాటు నీటి సమస్య ఎక్కువగా ఉన్న ప్రాంతాలు ఉండడంతో రైతులు మామిడి సాగును విస్తృతంగా చేపట్టారు. తక్కువ నీటి వనరులతో పాటు నిర్వ హణ భారం పెద్దగా ఉండకపోవడంతో రైతులు మామిడి సాగుపై మొగ్గు చూప డానికి ప్రధాన కారణం. అయితే ప్రతి ఏడాదీ మామిడి దిగుబడి సమ యంలో వచ్చే తొలకరి వర్షాల సమయంలో వీచే గాలులకు చాలా తోటల్లో కాయలు నేలరాలిపోతున్నాయి. ఈ కాయలను మార్కె ట్లో కొనడం లేదు. కొను గోలు చేసినా చాలా తక్కువకు ఇస్తున్నారు. పల్ప్ పరి శ్రమలు ఉన్నా సరైన ధర ఇవ్వక పోవడంతో మామిడి రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధర కల్పించేందుకు మామిడి బోర్డు ఏర్పాటు చేసి తమను ఆదుకోవాలని పలువురు మామిడి రైతులు కోరుతున్నారు.

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు


కస్తూరి - రఘు

తిరుమల, మే 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి సతీష్ వేమన, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, కర్ణాటక మంత్రి భైరాతి సురేష్, సినీ నటులు రఘు, కస్తూరి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

సంకల్పం నెరవేరాలని కోరా: యార్లగడ్డ

విశ్వ హిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ కూడా ఆదివారం శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. తనను హిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడిగా నియమించి ఐక్యరాజ్య సమితిలో హిందీని అధికార భాషగా గుర్తింపు తెచ్చే కార్యక్రమాన్ని తనకు అప్పగించారన్నారు. తాను ప్రస్తుతం వివిధ దేశాలు తిరుగుతున్నట్టు తెలిపారు. ఆయా దేశాల్లో ప్రభుత్వంపై ప్రభావం చూపే భారతీయ ప్రముఖులను కలిసి హిందీ భాషకు అనుకూలంగా ఓటు వేయాలని ప్రచారం చేస్తున్నట్లు వివరించారు. తమ సంకల్పం నెరవేరాలని స్వామిని కోరుకున్నానని చెప్పారు.